సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 9 । ఫిబ్రవరి । 2023





## భద్రాద్రికి పాదయాత్ర

కొయ్యలగూడెం: భద్రాచలానికి భక్తులు పాదయాత్రగా వెళ్తున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలానికి చెందిన భక్తులు 300 మంది భక్తులు భద్రాదికి వెళ్లారు.



## వైభవంగా ధ్వజ ప్రతిష్ఠ

పెనుగొండ: జనార్ధన స్వామి ఆలయంలో ఆలయ శిఖర, జీవ ధ్వజ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. వాస్తు, గో పూజ, ప్రధాన హోమాలు నిర్వహించారు.



## సాయి చాలీసా పారాయణం

భీమవరం (ప్రకాశంచౌక్) : 14వ వార్డు అభయ సాయి ధ్యాన మందిరం వార్షికోత్సవంలో బుధవారం విష్ణు సహస్రనామం, సాయి చాలీసా పారాయణం నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### హనోక్ వర్ధన్‌కు ఐకానిక్ అవార్డు




అంతర్జాతీయ ఆసియా ఐకానిక్ అవార్డు అందుకుంటున్న హనోక్ వర్ధన్

సాక్షి, భీమవరం: సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న భీమవరం పట్టణం గునుపూడికి చెందిన యాళ్ల హనోక్ వర్ధన్‌కు అంతర్జాతీయ ఆసియా ఐకానిక్ అవార్డు దక్కింది. గ్లోబల్ హ్యూమన్ రైట్స్ చైర్మన్ చేతుల మీదుగా ఈనెల 7న నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో అశోక్ సూద్‌శాస్త్రి, రంజన్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

### 11న వెంకయ్యనాయుడు పర్యటన

సాక్షి, భీమవరం : భీమవరంలో ఈ నెల 11న మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని సమాచారశాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. శనివారం ఉదయం భీమవరం చేరుకుని పట్టణంలోని శివరావుపేటలోని విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, శ్రీవిష్ణు కళాశాలల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

### 11, 12 తేదీల్లో హెచ్‌ఎం అకౌంట్ టెస్ట్ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హెడ్ మాస్టర్స్ అకౌంట్ టెస్ట్ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైందని జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ అవధాని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకూ పేపర్-1 ( పుస్తకాలు లేకుండా రాయాలి) పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈ నెల 12న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పేపర్-2 (పుస్తకాలు చూసి రాయవచ్చు) జరుగుతుందని తెలిపారు. పరీక్షలకు సంబంధించిన హాల్ టిక్కెట్లను బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్ నుంచి తమ రిజిస్ట్రేషన్ నెంబర్, పుట్టిన తేదీల ధారంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ పరీక్షలు విజయవాడ వన్‌టౌన్‌లోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్, వైఎస్ఆర్ కడపలోని నగరపాలక సంస్థ ఉర్దూ బాలికల హైస్కూల్‌లో జరుగుతాయని వివరించారు.

### అందుబాటులో టీసీసీ సర్టిఫికెట్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : గత ఏడాది జూలై నెలలో జరిగిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులు (టీసీసీ) డ్రాయింగ్ హయ్యర్, లోయర్, టైలరింగ్ లోయర్, హయ్యర్‌కు సంబంధించిన సర్టిఫికెట్లు వచ్చాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ అవధాని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణులైన విద్యార్థులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించి సర్టిఫికెట్లు పొందవచ్చని తెలిపారు. అభ్యర్థులు కార్యాలయం పని దినాలు, పని వేళల్లో మాత్రమే సంప్రదించాలని సూచించారు.

### విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక వాయిదా

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : జిల్లాలో విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ఉద్దేశించి ఈ నెల 9న నిర్వహించ తలపెట్టిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక వాయిదా పడిందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్లు అందించాలి

నూజివీడు: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం డబ్బులు చెల్లించి పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌లు అందజేసి, లైన్లు త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ ఏ.మురళీమోహన్ ఆదేశించారు. నూజివీడు డివిజన్‌లోని డీఈలు, ఏఈలకు పట్టణంలోని ఇండోర్ సబ్‌స్టేషన్‌లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు డబ్బులు చెల్లించి ఏళ్ల తరబడి కనెక్షన్ల కోసం ఎదురు చూస్తున్నారని, అలాంటి వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నూజివీడు, తిరువూరు, విస్సన్నపేట సబ్‌డివిజన్‌ల పరిధిలో జగనన్న కాలనీల్లో గృహాల నిర్మాణం పూర్తయిన గృహాలకు వెంటనే విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని చెప్పారు.

# డ్వాక్రా మహిళలకు చేయూత

- రుణాల చెల్లింపుల్లోనూ డ్వాక్రా మహిళలు ముందంజ
- 2022-23లో రూ.2227.12 కోట్లు రుణాలు అందజేత

## ఉమ్మడి పశ్చిమలో రికార్డు స్థాయిలో రుణాలు అందజేత



ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు ఆర్థిక చేయూతను అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మహిళా సాధికారతే లక్ష్యంగా మహిళలకు పెద్ద ఎత్తున రుణ సహకారాన్ని బ్యాంకుల ద్వారా అందించే ఏర్పాటు చేస్తుంది. దీంతో పొదుపు సంఘాల్లోని మహిళలు డెయిరీ యూనిట్లు, గొర్రెలు, మేకల పెంపకం, కుటీర పరిశ్రమలు ఏర్పాటు వంటివి ఏర్పాటు చేసుకుని స్వశక్తితో ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నారు. బ్యాంకులు సైతం డ్వాక్రా మహిళలకు రుణాలు అందించేందుకు ముందుకు వస్తున్నాయి. రుణాల చెల్లింపుల్లోనూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళలు ముందంజలో ఉన్నారు.

**ఇంతవరకూ రూ.2,227 కోట్ల రుణాలు అందజేత**

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకూ మహిళలకు రూ.2,227 కోట్లు రుణాలుగా అందించారు. 2021-22లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 53,833 గ్రూపులకు ఏకంగా రూ.2,915 కోట్లు రుణాలు అందజేయగా.. 2020-21లో రూ.1,561 కోట్లు అందజేసారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డ్వాక్రా సంఘాలకు ప్రతి సంవత్సరం లక్ష్యాలకు మించి రుణాలు అందజేస్తున్నారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి స్వయం సమృద్ధి సాధించాలనే ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఈ కేటాయింపులు చేస్తూ వచ్చారు. 2019-20లో 122 శాతం, 2020-21 లో 117.61 శాతం, 2021-22 ఆర్థిక సంవత్సరంలో 182 శాతం, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 10నెలల వ్యవధిలో 110 శాతం మేరకు రుణాలను అందజేశారు.

**రూ.20 లక్షల వరకూ రుణం అందజేత**

ఆయా గ్రూపుల సీనియార్టీని బట్టి స్వయం సహాయక సంఘాలకు రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకూ రుణాలుగా బ్యాంకులు అందజేస్తున్నాయి. ఏలూరు జిల్లాలో 2022-23 సంవత్సరంలో ఇంతవరకూ 22,081 గ్రూపులకు రూ.1140.45 కోట్ల మేరకు రుణాలు అందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో 27,312 గ్రూపులకు రూ.1,083.53 కోట్లు లక్ష్యంగా అధికారులు నిర్దేశించుకున్నారు. లక్ష్యానికి మించి రుణాలు అందజేశారు.

**పశ్చిమలో రూ.980 కోట్లు అందజేత**

జిల్లా వ్యాప్తంగా 2022-23 సంవత్సరంలో ఇంతవరకూ 16,696 గ్రూపులకు రూ.980.36 కోట్ల మేరకు బ్యాంకు రుణాలు అందజేసారు. రూ.741.83 కోట్లు లక్ష్యం నిర్ధేశించుకోగా లక్ష్యాన్ని అధిగమించి 132.15 శాతం రుణాలు అందించారు.

**నాలుగేళ్లుగా ఉమ్మడి పశ్చిమలో అందించిన రుణాల వివరాలు**

| ఆర్థిక సంవత్సరం | గ్రూపులు | ఇచ్చిన మొత్తం రూ. కోట్లలో |
|---|---|---|
| 2019-20 | 47,105 | 1644.95 |
| 2020-21 | 55,566 | 1561.09 |
| 2021-22 | 53,833 | 2,915.30 |
| 2022-23 (10నెలలు) | 40,995 | 2227.12 |

**ఉమ్మడి పశ్చిమగోదావరిలోని డ్వాక్రా సంఘాల వివరాలు**

మొత్తం స్వయం సహాయక సంఘాల సంఖ్య : 89,856

డ్వాక్రా సంఘాల్లో సభ్యుల సంఖ్య : 9,15,775

గ్రూపులో సగటు సభ్యుల సంఖ్య : 10

### లక్ష్యానికి మించి రుణాలు అందజేస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించడంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, మెప్మా సంస్థలు కృషి చేస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో డ్వాక్రా సంఘాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, బ్యాంకుల నుంచి రుణ సహాయం పొందేందుకు ఉద్యోగులు ఎప్పటికప్పుడు సహకరిస్తున్నారు. దీంతో గత నాలుగేళ్ల నుంచి రుణాల అందించడంలో పురోభివృద్ధి ఎక్కువగా ఉంది. ఈ కారణంగానే లక్ష్యానికి మించి రుణాలు అందజేస్తున్నాం.

– ఆర్.విజయరాజు, పీడీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఏలూరు

### ఇప్పటికే 132 శాతం రుణాలు అందజేత



పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే లక్ష్యాలకు మించి 132 శాతం రుణాలు అందించారు. డ్వాక్రా సంఘాలు బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించే ప్రక్రియ బాగుంది. దీంతో ఆయా సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలు అందించడంలో బ్యాంకులు సహకరిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మరింత మంది మహిళలకు రుణాలు అందజేసేందుకు కృషి చేస్తున్నాము.

– ఎంఎస్ఎస్ వేణుగోపాల్, పీడీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పశ్చిమగోదావరి జిల్లా

## గూడెంలో ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాలపై హర్షం



తాడేపల్లిగూడెం పట్టణం

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలో ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాల ఏర్పాటుకు బుధవారం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ చేసిన కృషి ఫలించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉన్న గూడెం ప్రాంతంలో గతంలో ఆశించిన మేర అభివృద్ధి జరగలేదు. కొట్టు సత్యనారాయణ నాయకత్వంలో నియోజకవర్గ రూపురేఖలు మారాయి. రూ. 600 కోట్లతో అప్పట్లో చేసిన అభివృద్ధి పనులు ల్యాండ్‌మార్క్‌గా నిలిచాయి. డీఎస్పీ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం తీసుకురావాలని కొట్టు సత్యనారాయణ తొలిసారి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రయత్నించారు. అప్పుడు కొన్ని కారణాల వల్ల జరగలేదు. ఇప్పుడు ఈ ప్రాంతంలో డీఎస్పీ, ఆర్డీఓ కార్యాలయ ఏర్పాటుకు చేసిన కృషి ఫలించింది. బుధవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ రెండింటి ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. ఎప్పటి నుంచి ఈ ప్రాంత వాసులు కన్న కలలు సాకారమయ్యాయి. పట్టణానికి రెవిన్యూ, పోలీసు సబ్ డివిజన్‌లు రావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు, పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నాయి. మంత్రి కొట్టుకు అభినందనలు తెలిపారు.

# ఇళ్ల నిర్మాణాల్ని వేగవంతం చేయాలి

**కలెక్టర్ ప్రశాంతి**



కుప్పనపూడి శివారు తాళ్లకోడులో జగనన్న లేఅవుట్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ పి.ప్రశాంతి

ఆకివీడు: జిల్లాలోని అన్ని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల్ని వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారుల్ని ఆదేశించారు. మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలో లేఅవుట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల్ని వేగవంతం చేయాలన్నారు. రోడ్లు, మంచినీరు, విద్యుత్ సదుపాయం కల్పించేందుకు పనులు వేగంగా కొనసాగించాలని ఆదేశించారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన తీసుకురావాలన్నారు. ఇళ్లు నిర్మించుకోకుండా ఉండే వ్యక్తుల జాబితా తయారు చేసి వారికి నోటీసులివ్వాలని అధికారుల్ని ఆదేశించారు. గృహ నిర్మాణాల్లో ప్రతిరోజూ స్టేజ్ కన్వర్షన్ వివరాలు తెలియజేయాలన్నారు.

పునాదుల స్థాయి నుంచి శ్లాబ్ వరకూ వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాల్ని పరిశీలించి నివేదిక పంపాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునేలా ముందుకు తీసుకురావాలన్నారు. లేఅవుట్ పరిశీలనకు వచ్చినప్పుడు ప్రగతి కనపించాలని అధికారుల్ని హెచ్చరించారు. తాళ్లకోడులోని 74 ఎకరాల్లో 2,791 ఇళ్ల నిర్మాణంలో కేవలం 210 ఇళ్ల నిర్మాణం పూర్తి కావడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేసి సంబంధిత అధికారుల పనితీరుపై మండిపడ్డారు. ఇదే విధానాన్ని కొనసాగిస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. కలెక్టర్‌తో మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య మాట్లాడుతూ గతంలో నిర్మించిన అప్రోచ్ రోడ్డుకు బిల్లు రాలేదని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ముత్యాల రత్నం, హౌసింగ్ పీడీ ఏవీ రామరాజు, ఈఈ బీ.వెంకటరమణ, డీఈఈ పీ.శివరామరాజు, ఏఈ భాస్కరరాజు, కమిషనర్ తిరుమలరావు, తహశీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రీ సర్వే పనుల పరిశీలన



రీ సర్వే పనులు పరిశీలిస్తున్న జేసీ మురళి

పాలకోడేరు : రీ సర్వే పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేసి మంచి ఫలితాలు సాంధించాలని జిల్లా జాయింట్ కలెక్టరు జేవీ మురళి అన్నారు. బుధవారం పాలకోడేరు మండలం పాలకోడేరు రీ సర్వే పనులను జాయింటు కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భీమవరం డివిజన్‌లో 28 గ్రామాలు రీ సర్వే అయ్యాయని, మిగిలిన 100 గ్రామాలు ఫిబ్రవరి నెలాఖరున పూర్తి చేయాలని సర్వే అధికారులను ఆదేశించారు. రీ సర్వేలో భాగంగా గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు, చెక్ పాయింట్లను కచ్చితంగా గుర్తించి పనులు వేగవంతం చేయాలన్నారు. నరసాపురం డివిజన్‌లో గ్రామాల రీసర్వేలో భాగంగా డ్రోన్ ఎగురవేసేందుకు చేసేందుకు పైలెట్ ఏజెన్సీకి కేటాయించామని, అధికారులు, సిబ్బంది సన్నద్ధులుగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సర్వేలో భాగంగా ప్రతి అంగుళం ప్రభుత్వ భూమిని గుర్తించి రికార్డు చేస్తామని, ప్రతి రైతు జి రాయితీ భూమిని పక్కాగా సర్వే నిర్వహించి రికార్డులు తయారు చేస్తామని జాయింటు కలెక్టరు అన్నారు.

**సచివాలయాల తనిఖీ చేసిన జేసీ**

గ్రామ సచివాలయాలు ప్రజలకు మంచి సేవలు అందించి, జవాబుదారీగా ఉండాలని జాయింటు కలెక్టరు అన్నారు. పాలకోడేరు 1, 2 , వేంద్ర గ్రామ సచివాలయాలను జాయింటు కలెక్టరు జేవీ మురళి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, సంక్షేమ పథకాల క్యాలెండర్, ఎస్ఎల్‌ఏ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కారం నివేదిక తదితర వాటిని పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను సోషల్ ఆడిట్ చేశారా లేదా అన్నది పరిశీలించారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను ఇంటి వద్దనే అందించేందుకు సచివాలయ వ్యవస్థ ఎంతో కీలకమన్నారు.ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించి పథకాలకు సంబంధించి అవగాహన కల్పించాలన్నారు. సచివాలయంలో ఆలస్యం లేకుండా ప్రజలకు పౌర సేవలు అందాలని చెప్పారు.

# పట్టిసంలో శివరాత్రికి ఏర్పాట్లు



పట్టిసం ఇసుక తిన్నెలు

పోలవరం రూరల్: ఈ నెల 18వ తేదీన మహాశివ రాత్రి సందర్భంగా పట్టిసం శివక్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేస్తున్నారు. 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు ఇసుక తిన్నెలపై జరిగే ఈ ఉత్సవాలకు లక్ష మందికి పైగా హాజరవుతారనే అంచనా నేపథ్యంలో పటిష్ట పనులు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా భక్తులు నేరుగా కాలినడకన వెళ్ళి శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకుని వచ్చేలా ఏర్పాటు చేశారు. పట్టిసం రేవులో పంట్లు ఎక్కి దిగేందుకు వీలుగా ర్యాంపులు, క్యూలైన్‌లు, టిక్కెట్ కౌంటర్ల పనులను ఫెర్రీ కాంట్రాక్టర్ చేపట్టారు. గోదావరి నది గత ఏడాది కంటే కొంత వెడల్పు పెరగడంతో ఆరు పంట్లు ఏర్పాటు చేసి భక్తులు కాలినడకన వెళ్లి వచ్చేలా సిద్ధం చేస్తున్నారు. శివక్షేత్రం వైపు కొంత మేర ఇరువైపులా బాదులు, తడికెలతో నిర్మించి, మధ్యలో ఇసుక బస్తాలతో మార్గం చేశారు. బస్సు దిగి శివక్షేత్రానికి వెళ్లి దైవదర్శనం చేసుకుని వచ్చేంత వరకు సుమారు ఐదున్నర కిలోమీటర్లు వరకు కాలినడకన భక్తులు వెళ్లి రావాల్సిన పరిస్థితి. ఇసుక తిన్నెలపై ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం 20 చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. స్నాన ఘట్టాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు తాటాకులతో నిర్మిస్తున్నారు. ఇసుక తిన్నెలపై పోలీసు, ప్రథమ చికిత్సా కేంద్రాలు, ఎక్సైజ్ , రెవెన్యూ శాఖాధికారులకు షెల్టర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామపంచాయతీ చేపట్టే పనులకు సంబంధించి టెండర్లు ఖరారయ్యారని, పనులు జరుగుతున్నాయని పంచాయతీ కార్యదర్శి టి.విజయకుమారి తెలిపారు. శివక్షేత్రం వద్ద భక్తులు దైవదర్శం చేసుకుని వెళ్లి వచ్చే విధంగా క్యూలైన్లు, షామియానాలు పనులు చేపడుతున్నారు.





పట్టిసం రేవులో ఏర్పాటు చేస్తున్న టికెట్ కౌంటర్‌లు, పంట్లు ఎక్కేందుకు ర్యాంపు

# మల్చింగ్‌తో మేలైన దిగుబడి

- ఉద్యాన పంటల సాగులో ప్రయోగాత్మకంగా అమలు
- ఇప్పటికే తణుకు, గూడెం మండలాల్లో సాగు

సాక్షి, భీమవరం: ఉద్యాన సాగులో మల్చింగ్ విధానం ఇప్పుడు రైతులను ఆకట్టుకుంటోంది. ఇప్పటికే ఉద్యానవన శాఖ రైతుల్ని ప్రోత్సహిస్తూ.. వారికి పెద్ద మొత్తంలో సబ్సిడీ అందజేస్తోంది. తీగ జాతి కూరగాయలు, పుచ్చ, కర్బూజ, పసుపు రంగు పుచ్చ, జామ సాగులో మల్చింగ్ విధానం ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో రైతులను ప్రోత్సహించి మల్చింగ్ విధానంలో 250 ఎకరాల్లో సాగు చేయించేందుకు లక్ష్యంగా నిర్ణయించారు.

**మల్చింగ్‌తో ప్రయోజనాలు**

తీగజాతి కూరగాయలతోపాటు వివిధ రకాల పండ్ల జాతులకు చెందిన మొక్కలను పెంచేందుకు వరుసల్లో మొక్కలు నాటి వాటికి డ్రిప్ అమర్చి మొక్కలు మొదలు మినహా మిలిగిన ప్రాంతంలో ప్లాస్టిక్ సీట్‌ను అమర్చుతారు. దీనివల్ల నీరు వృథా కాకుండా ఉండడమేగాక కలుపు బెడద ఉండదు. పంటలకు వేయాల్సిన నత్రజని, యూరియా ఎరువులు సైతం డ్రిప్ ద్వారా అందించడం వల్ల పోషకాలు వృథాకావు. తెగుళ్లు, పురుగుల బెడద లేకుండా ఖర్చు తగ్గడమేగాక నాణ్యమైన పంట చేతికి వచ్చే అవకాశముంటుంది. జిల్లాలోని తాడేపల్లిగూడెం, తణుకు, పెనుగొండ, పోడూరు, ఆచంట, పాలకొల్లు, వీరవాసరం, నరసాపురం, మొగల్తూరు, పాలకోడేరు తదితర మండలాల్లో ఉద్యానవన పంటల సాగుకు అనువైన భూములున్నాయి.



తాడేపల్లిగూడెంలో మల్చింగ్ విధానంలో సాగు

**కడియద్ద, తాడేపల్లిగూడెంలో సాగు :** తాడేపల్లిగూడెం, కడియద్ద వద్ద మల్చింగ్ విధానంలో 10 ఎకరాల్లో కర్బూజ, పుచ్చ, పసుపు పుచ్చ వంటి వాటిని ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెం, తణుకు మండలాల్లో రైతులు మల్చింగ్ విధానంలో సాగు చేపట్టారు.

**మల్చింగ్ విధానానికి ప్రభుత్వ రాయితీ.**

మల్చింగ్ విధానాన్ని ప్రోత్సహించడానికి రైతులకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో రాయితీ ఇస్తోంది. మల్చింగ్ విధానంలో పంటలు సాగుచేయడానికి సుమారు రూ.32 వేలు ఖర్చవుతుంటే ప్రభుత్వం సుమారు రూ.16 వేలు రాయితీగా అందిస్తోంది. మల్చింగ్ విధానంలో ఉద్యానవన సాగు చేయాలనుకుంటే రైతులు రైతుభరోసా కేంద్రంలో నమోదుచేయించుకోవాలి.

### వేసవిలో ఎక్కువ ప్రయోజనం

తీగ జాతి, పండ్ల మొక్కల పెంపకంలో మల్చింగ్ విధానం వల్ల రైతులకు అనేక ప్రయోజనాలుంటాయి. ప్లాస్టిక్ షీట్ వేయడం వల్ల కలుపు ఖర్చులు గణనీయంగా తగ్గడమేగాక ఎరువులను నేరుగా డ్రిప్ పద్ధతిలో పంపడం వల్ల పోషకాలు వృథా కావు. మల్చింగ్ విధానంలో ప్రభుత్వం ఎకరాకు రూ. 16 వేలు రాయితీ అందిస్తుంది.

– ఎ.దుర్గేష్, ఉద్యానవన శాఖాధికారి, భీమవరం

## లారీ ఢీకొని పొక్లెయిన్ ఆపరేటర్ దుర్మరణం


ఇర్ఫాన్ మృతదేహం

కై కలూరు(కలిదిండి): ద్విచక్రవాహనంపై వెళుతుండగా లారీ ఢీకొనడంతో ఓ పొక్లెయిన్ ఆపరేటర్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. కలిదిండి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన ఇర్ఫాన్ అన్సారీ (27) పెదలంక సమీపంలోని సూరంపూడిలో పొక్లెయిన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ద్విచక్ర వాహనంపై మూలలంక వస్తుండగా ఎదురుగా వచ్చిన తవుడు లోడు లారీ ఇతనిని ఢీకొట్టింది. దీంతో అన్సారీ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య ఉన్నారు. కలిదిండి ఎస్సై మణికుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బంధువులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.





# కుష్టు నివారణే లక్ష్యంగా.. స్పర్శ

- జిల్లా వైద్యారోగ్య శాఖ పటిష్ట కార్యాచరణ
- 1324 టీమ్‌లతో ఇంటింటి వెళ్లి పరీక్షలు
- సర్వేలో 3089 అనుమానితుల గుర్తింపు
- 43 మందికి నిర్ధారణ.. 15న సర్వే పూర్తి

జిల్లాను కుష్టు (లెప్రసీ) రహితంగా మార్చడమే లక్ష్యంగా వైద్యారోగ్య శాఖ స్పర్శ అనే ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. దీనిలో భాగంగా గత నెల 30 నుంచి జిల్లా వ్యాప్తంగా ఇంటింటా సర్వే, పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రతి గ్రామంలో సర్పంచ్, రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి సహకారంతో గ్రామసభల ద్వారా అవగాహన కల్పిస్తోంది. వలంటీర్, ఆశ, ఏఎన్‌ఎంతో కూడిన బృందాలు ఇంటింటికీ వెళ్లి వ్యాధి లక్షణాలు ఉన్న అనుమానితులను గుర్తించి పరీక్షలు చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,325 బృందాలు ఈ సర్వేలో చేస్తుండగా, ఈనెల 15వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగనుంది.


ఆచంట వేమవరంలో ఓ మహిళను పరీక్షిస్తున్న వైద్య బృందం


మాధవరంలో ఓ వ్యక్తిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా వైద్యారోగ్య శాఖ చేపట్టిన స్పర్శ కార్యక్రమం ద్వారా జిల్లాలో నిర్వహిస్తున్న సర్వే ఇప్పటివరకు 96 శాతం పూర్తయింది. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 44,37,69 కుటుంబాలకు సర్వే చేయగా 17,69,171 మందికి పరీక్షించారు. అందులో 3,089 మంది అనుమాతులను గుర్తించారు. వీరిలో 2,470 మందికి పరీక్షలు చేయగా 43 మందికి వ్యాధి నిర్ధారణ అయింది. 40 మంది పెద్దలు కాగా, 3గురు పిల్లలు వ్యాధికి గురైనట్లు అధికారులు చెబుతున్నారు.

**వ్యాధి లక్షణాలు ఇవే**

- శరీరంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు చర్మం, ఉబ్బెత్తుగా, బత్తాయి తొక్కలా మారడం
- చెవులు, వీపు, ఛాతిపై నొప్పి లేని బొడిపెలు. కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం
- ముక్కుదిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం, కాళ్లు, చేతులకు తిమ్మిర్లు
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ లేకపోవడం, చేతి, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం ఏర్పడటం

**ఎలా సోకుతుంది**

కుష్టు వ్యాధి మైకోబాక్టీరియం లెప్రే అనే బాక్టీరియా వల్ల వస్తుంది. ఈ క్రిములు తుమ్ము, దగ్గు ద్వారా వ్యాప్తి చెందుతాయి. వ్యాధి లక్షణాలు కనిపించేందుకు మూడు నుంచి ఐదేళ్లు పడుతుంది. వ్యాధి లక్షణాలున్న వారికి రెండు పద్ధతుల్లో చికిత్స అందిస్తారు. శరీరంపై మూడు మచ్చలున్న వారికి ఆరు నెలల పాటు, ఐదు మచ్చలు పైబడి ఉన్న వారికి మల్టీ బ్యాసిలరీ (ఎంబీ) విధానంలో 12 నెలల పాటు చికిత్స అందిస్తారు. దీనిలో భాగంగా నెలకొకసారి వైద్య సిబ్బంది నేరుగా రోగుల ఇంటికి వెళ్లి మందులు అందిస్తారు. సర్వేలో గుర్తించిన రోగులకు సకాలంలో వైద్యం అందించడంతో పాటు ఆ వ్యాధిపై వారికి, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్యంతో నివారించే అవకాశ ముంది. మల్టీ డ్రగ్ థెరపీతో వ్యాధిని అరికడుతున్నారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ఈ చికిత్సా విధానం అందుబాటులో ఉంది.

### బాధితులను గుర్తించి చికిత్స ఇస్తున్నాం



జిల్లాను కుష్టు రహితంగా తీర్చిదిద్దేందుకు స్పర్శ కార్యక్రమం ద్వారా లెప్రసీ వ్యాధి గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నాం. ఈనెల 15 వరకు సర్వే కొనసాగుతుంది. వైద్య, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. ఇప్పటివరకు 96 శాతం సర్వే పూర్తి చేశాం. సర్వేలో అనుమానితులను గుర్తించి వారికి పరీక్షలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఇప్పటివరకు 43 మంది వ్యాధికి గురైనట్లు గుర్తించాం. వారిలో 40 మంది పెద్దలు కాగా ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరికి చికిత్స ప్రారంభించాం. జిల్లా కలెక్టర్ సూచనలు, సలహాల మేరకు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– భానునాయక్ అడిషనల్ డీఎంహెచ్‌వో, జిల్లా టీబీ, లెప్రసీ అధికారి భీమవరం

## పంటల సాగులో ఉత్తమ యాజమాన్యం అవసరం

సీటీఆర్ఐ డైరెక్టర్ శేషమాధవ్

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): పంటల సాగులో ఉత్తమమైన యాజమాన్యం అవసరమని ఐసీఏఆర్ సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. జీలుగుమిల్లి ఐసీఏఆర్ – సీటీఆర్ఐ పరిశోధనా కేంద్రంలో ఎస్సీ సబ్ ప్లాన్, టీఎస్పీ ఉప ప్రణాళికలో భాగంగా బుధవారం రైతు దినోత్సవం, రైతు శిక్షణా కార్యక్రమం సీటీఆర్ఐ ఆర్ఎస్ హెడ్ డాక్టర్ వై.సుబ్బయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతించిన పొగాకు వంగడాలనే సాగు చెయ్యాలని అన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ టీఎస్పీ నిధుల ద్వారా చిన్న, సన్నకారు రైతులకు సీటీఆర్ఐ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా సీనియర్ పొగాకు రైతు గద్దే లక్ష్మణరావు పొగాకు సాగులో గల ఇబ్బందులను వివరించారు. అభ్యుదయ రైతు తెల్లం వెంకటేశ్వరరావు పొగాకు పంటతోపాటు ఇతర వాణిజ్య పంటల సాగు, సమీకృత వ్యవసాయ సాగు విధానాన్ని వివరించారు. బోర్డు ఆర్ఎం ప్రసాద్ మాట్లాడుతూ నాణ్యమైన ఉత్తమ గ్రేడ్‌ల పొగాకు ఆవశ్యకతను వివరించారు. వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకన్న, ఎస్సీ సబ్‌ప్లాన్ రైతు కె.సుబ్బారావు, సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు సి.చంద్రశేఖరరావు, కస్తూరి కృష్ణ, సరళ, వెంకటేశ్వరరావు, జీలుగుమిల్లి సీటీఆర్ఐ ఫార్మా మేనేజర్ ఎంవీ జయకృష్ణ, అసిస్టెంట్ ఫార్మా మేనేజర్స్ ఎస్.సింహాచలం, టి.రమేష్, ఎ.ప్రభు, సీటీఆర్ఐ సిబ్బంది, పొగాకు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది సన్న, చిన్నకారు రైతులకు పారలు, కొడవల్లు, బేరన్ క్యూరో మీటర్లను పంపిణీ చేశారు. అనంతరం పసుపు ప్రోసెస్సింగ్‌కు సంబంధించిన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా స్ట్రింగింగ్ హాల్‌ను ప్రారంభించారు. అదేవిధంగా గ్రామ సమీపంలో ఉన్న పొగాకు తోటలను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.


స్ట్రింగింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న శేషుమాధవ్

## సాగునీటి కొరత లేకుండా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ సూర్యతేజ

నరసాపురం: రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ అధికారులను ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో నీటి పారుదల, వ్యవసాయం, ఆర్‌డబ్ల్యూఎస్, ఫిషరీష్, రెవెన్యూ అధికారులతో సాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ శివారు ప్రాంతాలకు కూడా సమృద్ధిగా సాగునీరు అందాలన్నారు. తమ భూములకు నీరు అందడంలేదని రైతులు నుంచి ఫిర్యాదు వస్తే సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని హెచ్చరించారు. వంతులవారీ విధానాన్ని అనుసరించి విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అన్ని భూములకు సక్రమంగా నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారుల మధ్య సమన్వయం అవసరమన్నారు. అక్రమంగా నీటిని మళ్లించడం చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంజిన్‌ల ద్వారా ఎక్కడైనా నీటిని తోడితే ఇంజిన్‌లు సీజ్ చేయాలని చెప్పారు. తాగునీరు మొదటి ప్రాధాన్యత, సాగునీరు రెండో ప్రాధాన్యత, అనుమతి పొందిన ఆక్వా చెరువులకు మూడో ప్రాధాన్యతగా నీరందించాలని సూచించారు. వంతుల వారీగా నీరు ఏరోజు ఏఏ ప్రాంతాల్లో అందుతుందో ఆయా గ్రామాల్లో టాంటాం, మైక్ ప్రచారం ద్వారా ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

### 98 డీఎస్సీ పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదంపై హర్షం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో 98 డీఎస్సీ పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదించడంపై వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు గెడ్డం సుధీర్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేస్తున్నారని, గత 30 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న 98 డీఎస్సీ అభ్యర్థులకు తీపి కబురు చెప్పారని అన్నారు. రాష్ట్రంలో విద్యారంగం మెరుగుపడేలా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటూ ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీసుకువెళుతున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. 98 డీఎస్సీ పోస్టులను భర్తీ చేయించడానికి కృషి చేసిన ఎమ్మెల్సీ టీ.కల్పలతా రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# స్కూటీని ఢీకొట్టిన వ్యాన్


ప్రమాదంలో స్కూటీని ఈడ్చుకుంటూ వెళ్లిన వ్యాన్


మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలిస్తున్న దృశ్యం

- అక్కడికక్కడే తల్లి మృతి, కుమార్తెకు తీవ్ర గాయాలు
- అలంపురం వద్ద ఘటన.. పెళ్లికి వెళుతుండగా ప్రమాదం


శీతాల శ్రీదేవి (ఫైల్)

పెంటపాడు: అలంపురం వద్ద జాతీయ రహదారిపై బుధవారం స్కూటీని వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో స్కూటీపై వెళుతున్న తల్లి ఘటనా స్థలంలోనే మృతి చెందగా, కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. పెంటపాడు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తణుకులో లక్ష్మి థియేటర్ ప్రాంతానికి చెందిన శీతాల శ్రీదేవి (45), కుమార్తె శీతాల సత్య స్కూటీపై ప్రత్తిపాడులోని ఒక శుభకార్యానికి వెళుతున్నారు. అలంపురం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్తిపాడు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కృష్ణా జిల్లా పోతునూరు నుంచి కాకినాడలో వివాహానికి బంధువులతో వెళుతున్న ఐసర్‌వ్యాన్ వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో స్కూటీని కొంతదూరం ఈడ్చుకుపోగా వెనుక కూర్చున్న శ్రీదేవి అక్కడిక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలపాలైన కుమార్తె సత్యను స్థానికులు తణుకు ఏరియా ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. పెంటపాడు ఎస్సై సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. శ్రీదేవి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తాడేపల్లిగూడెం తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.సత్యనారాయణ చెప్పారు.

## ఆకతాయిలకు దేహశుద్ధి


ఎన్నార్పీ అగ్రహారంలో ఆకతాయిలకు దేహశుద్ధి చేస్తున్న దృశ్యం

ఉండి: కళాశాల విద్యార్థినులను నిత్యం వేధిస్తున్న ఆకతాయిలకు బుధవారం ఎన్నార్పీ అగ్రహారంలో స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. భీమవరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఉండి, ఆకివీడు ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు కళాశాల బస్సులో వెళ్లివస్తుంటారు. కొందరు యువకులు జీపు, ద్విచక్రవాహనాల్లో ప్రతి రోజు బస్సును అనుసరిస్తూ విద్యార్థులను పలు రకాలుగా వేధింపులకు గురిచేస్తున్నారు. బుధవారం ఆకతాయిలు ఇలాగే వ్యవహరించడంతో యువకులను బస్సు డ్రైవర్ హెచ్చరించాడు. దీంతో ఎన్నార్పీ అగ్రహారంలో ఉండి బస్టాండ్‌కు సమీపంలో ఆకతాయిలు బస్సును అడ్డగించి డ్రైవర్‌పై దాడికి తెగబడ్డారు. ఇది గమనించిన స్థానికులు, వాహనదారులు యువకులను అడ్డుకున్నారు. కొందరు యువకులు జీపు, ఒక ద్విచక్రవాహనంపై పారిపోగా మరొక ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు ఆకతాయిలను పట్టుకుని స్థానికులు దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై కే గంగాధరరావు ఘటనా స్థలికి చేరుకుని ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కళాశాల లెక్చరర్ దుండి షారోన్‌రోజా ఫిర్యాదు మేరకు మొత్తం నలుగురు యువకులతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### మోగల్లులో తాపీమేస్త్రి హత్య


అప్పన మణికంఠ మృతదేహం

పాలకోడేరు: మోగల్లులో ఓ తాపీమేస్త్రి హత్యకు గురయ్యాడు. భీమవరం రూరల్ సీఐ సీహెచ్ నాగ ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మోగల్లుకు చెందిన అప్పన మణికంఠ (30) తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి 9.30 గంటల వరకు బంధువులకు ఫోన్ కాంటాక్ట్‌లో ఉన్నాడు. అయితే బుధవారం ఉదయం వేంద్ర రోడ్డులోని కారింకి రాముడుకు చెందిన గడ్డి మేటు వద్ద శవమై కనిపించాడు. అతని తలపై గాయం ఉండటంతో హత్య కేసుగా నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహానికి పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. సీఐ ఆధ్వర్యంలో పాలకోడేరు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు హ్యాండ్‌బాల్ మహిళ జట్టు ఎంపిక

దెందులూరు: వేగవరంలోని హేలాపురి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం హ్యాండ్‌బాల్ మహిళ క్రీడాకారుల ఎంపిక పోటీలు జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన జట్టు మహాత్మాగాంధీ యూనివర్సిటీ కొట్టాయంలో ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. జేఎన్‌టీయూ పరిధిలో 8 జిల్లాల నుంచి విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొంటారని ఏఓ కరుణానిధి తెలిపారు.

## క్లుప్తంగా

### ఫిజియోథెరపీపై అవగాహన



భవిత దివ్యాంగుల కేంద్రంలో ఫిజియోథెరఫీపై అవగాహన

**తాడేపల్లిగూడెం:** సుబ్బారావుపేటలోని భవిత దివ్యాంగుల పాఠశాలలో ఫిజియోథెరపీపై విద్యార్థుల తల్లితండ్రులకు బుధవారం అవగాహన కల్పించారు. దివ్యాంగుల పిల్లలకు ఇంటి వద్ద చేసుకొనే ఫిజియోథెరపీపై డాక్టర్ అల్లు మహేష్ అవగాహన కల్పించారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కే బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ సమగ్ర శిక్ష దివ్యాంగుల పిల్లల అభివృద్ధికి అనేక సేవా కార్యక్రమాలు అందిస్తోందని తెలిపారు.

### చిన్నారులకు టీకాలు అందించాలి

**పాలకొల్లు అర్బన్:** చిన్నారులకు టీకాలు సకాలంలో వేసి వ్యాధుల నుంచి కాపాడాలని సర్పంచ్ దిడ్ల మణివజ్రం అన్నారు. మండలంలోని శివదేవునిచిక్కాల డా.వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల ప్రత్యేక శిబిరం నిర్వహించారు. పోలియో, బీసీజీ, డీపీటీ, హెపటైటిస్ బీ వ్యాక్సిన్‌లు చిన్నారులకు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఏఎన్‌ఎం కె.సుశీల పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**భీమవరం అర్బన్:** భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉరి వేసుకున్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఈలంపూడి గ్రామానికి చెందిన మైనపు జానకి రామయ్య (73) మానసిక ఆరోగ్య పరిస్థితి బాగోలేక గత నెల 28న ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకోబోగా కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో జానకిరామయ్య చికిత్స పొందుతుండగా మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ఆస్పత్రికి తరలించారు. బుధవారం జానకి రామయ్య చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆయన కుమారుడు మైనపు వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఆకురాతి సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పంట కోత ప్రయోగంపై శిక్షణ

**భీమవరం అర్బన్:** వ్యవసాయాధారిత గ్రామాలలో దాళ్వాకు సంబంధించి 4 పంట కోత ప్రయోగాలు నిర్వహించనున్నట్లు ఏఎస్‌ఓ రాజు, మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో ఆర్‌బీకే సెంటర్లో బుధవారం పంట కోత ప్రయోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌వో రాజు, ఏవో నిమ్మల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ సర్వే నెం, సబ్ డివిజన్ ఆధారంగా పంట కోత ప్రయోగాలు ఏ విధంగా చేయాలో? వివరించారు. అలాగే మండలంలో 16 వ్యవసాయాధారిత గ్రామాలలో ఒక్కో గ్రామంలో4 పంట కోత ప్రయోగాలు నిర్వహించాలన్నారు. దాళ్వాకు సంబంధించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆర్‌బీకే సెంటర్లలో బుక్ చేసుకోవాలని కోరారు. పలు వ్యవసాయా కార్యక్రమాలు గురించి ఈ శిక్షణ తరగతులలో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ రామ లింగేశ్వరరావు, బాల, కాశీమాత పాల్గొన్నారు.

### వీధి కుక్కలపై శ్రద్ధ వహించాలి

**ఆకివీడు:** పెంపుడు కుక్కలతో పాటు వీధి కుక్కల పట్ల కూడా శ్రద్ధ వహించాలని మండల పశువైద్యాధికారిణి కెల్లా భార్గవి సూచించారు. జంతు సంక్షేమ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని దుంపగడప గ్రామంలో 19 వీధి కుక్కలకు, 10 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా భార్గవి మాట్లాడుతూ వీధి కుక్కలకు వచ్చే జబ్బుల వల్ల అవి మనిషికి సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పలు గ్రామాల్లో వీధి కుక్కలు చర్మ వ్యాధులతోనూ, ఇతర వ్యాధులతో తిరుగుతున్నాయని చెప్పారు. అలాంటి కుక్కల్ని పట్టుకుని తమకు తెలియజేస్తే వైద్యం అందజేస్తామన్నారు. యాంటీ ర్యాబిస్ టీకాలు వేస్తామని చెప్పారు.

**పాడి రైతులకు పశు విజ్ఞానం**

పాడి రైతులకు పశు విజ్ఞానం అందజేసేందుకు ప్రతీ ఆర్బీకే వద్ద సమావేశాలు నిర్వహిస్తున్నట్లు భార్గవి చెప్పారు. దుంపగడప ఆర్బీకే వద్ద పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాదికి ఒక దూడ అనే అంశంపై రైతులతో చర్చించారు. పాడి పరిశ్రమ వృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందన్నారు. అధిక పాల దిగుబడికి రైతులు కృషి చేయాలన్నారు.

### జంతువులను సంరక్షించాలి

**సాక్షి, భీమవరం:** పశువుల్లో అంటుబట్టని వ్యాధులు వస్తుంటాయని జంతువులను సంరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జె.మురళీకృష్ణ అన్నారు. బుధవారం భీమవరం డీఎన్నార్ కళాశాలలో జంతువులపై అవగాహన, వ్యాధులు నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పశువుల్లో ముద్ద చర్మ వ్యాధి (లంపి స్కిన్) ఎక్కువగా కన్పిస్తోందని ఈ వ్యాధి తెల్ల జాతి పశువులలో అతి వేగంగా వ్యాపిస్తుందన్నారు. పశు వైద్యుల సూచనలతో చికిత్స అందించాలన్నారు. ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాఫర్ హుస్సేన్, ఏడీ కె.సత్యనారాయణ, కళాశాల జువాలజీ హెడ్ ఉషారాణి, పద్మజ పాల్గొన్నారు.

# ఈ-క్రాప్‌తో రైతులకు మేలు



ఆరుగొలనులో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ మురళీకృష్ణ తదిత



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ మురళీకృష్ణ, అధికారులు

ఏడీఏ మురళీకృష్ణ

**తాడేపల్లిగూడెం రూరల్:** పంట ఈ-క్రాప్ నమోదు రైతులకు మేలని వ్యవసాయ సహాయ సంచాలకుడు పి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామంలో ఈక్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈక్రాప్ నమోదు వల్ల ఎరువుల నుంచి పంట విక్రయించే వరకు ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. కొత్తూరులో ఇద్దరు సిబ్బందిని నియమించామని, ఈ క్రాప్ చేయించుకోవాలని అన్నారు. ఆరుగొలనులో 50 శాతం ఈక్రాప్ పూర్తయిందన్నారు. సొసైటీ ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను సరఫరా చేయాలని ఏడీఏ మురళీకృష్ణ సూచించారు. ఆయన వెంట ఏఓ ఆర్ఎస్ ప్రసాద్, ఆర్‌బీకే అసిస్టెంట్ మరిడి మధురత్నం, వీఆర్వో పోతురాజు, రైతు నూనె లక్ష్మణరావు ఉన్నారు.

**వరిపై ఆకుముడత తెగులు**

**పెంటపాడు:** వరిని ఆశించే ఆకుముడత తెగులుపై అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లిగూడెం ఏడీఏ పి.మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆకుతీగపాడు క్లస్టర్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం రైతులతో ఏఓ పార్థసారధి అధ్యక్షత సమావేశం నిర్వహించారు. మండలంలో అక్కడక్కడా ఆకుముడత ఉందని, దీనిని అరికట్టేందుకు మోనోక్రోటోఫాస్ స్ప్రే, కాండం తొలుచుపురుగు నివారణకు ఏటీజీసీ సిఫార్స్ చేసిన ఫిరమోన్ సొల్యూషన్ 100 ఎంఎల్ ఒక ఎకరానికి వాడుకోవాలని ఏడీఏ రైతులకు సూచించారు. చేలు పిలకల దశలో ఉన్న సందర్భంలో చేలలో నీరు 2 సెంటీమీటర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ, సేంద్రియ వ్యవసాయంపై లింగాకార బుట్టల ఏర్పాటు, ద్రావణం తయారు తదితర విషయాలు రైతులకు వివరించారు. ఏఓ పార్థసారధి మాట్లాడుతూ ప్రధానంగా కష్టమ్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ)ల ద్వారా యంత్రీకరణ పనిముట్లు ఉపయోగించుకోవాలన్నారు. బ్యాంక్ రుణాలు, సబ్సిడీ తదితర వివరాలను తెలియజేశారు. సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కై గాల శ్రీనివాస్, వీరాబత్తుల నాగసత్యనారాయణ, చింతల నాగరాజు, జాలపర్తి నాగేశ్వరరావు, వీపీఏలు రైతుమిత్ర గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ శ్రేణుల బైక్‌ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కొట్టు విశాల్, పార్టీ అభిమానులు

**తాడేపల్లిగూడెం అర్బన్:** తాడేపల్లిగూడెం పట్టణంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయం (ఆర్డీఓ), డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) కార్యాలయం ఏర్పాటును ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించడంతో ప్రజలు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. పార్టీ యువనేత కొట్టు విశాల్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మవారి ఆలయం నుంచి పోలీస్ ఐలాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడున్న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్టీ అభిమానులు, పట్టణ ప్రముఖులు, జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, రెడ్డి సూరిబాబు, పార్టీ పట్టణ మండలాల నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

### విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం

**అత్తిలి:** స్థానిక ఆంజనేయస్వామి ఆలయ సన్నిధిలో లలితా పరమేశ్వరిదేవి, విఘ్నేశ్వరస్వామి, సరస్వతిదేవి, ఆంజనేయస్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం మేళతాళాలతో దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగించారు. అర్చకులు నాగభీమశంకరశర్మ బ్రహ్మత్వంలో ఆగమ పండితుల సమక్షంలో పూజాదికాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 10న విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ దుడే ఉమా మహేశ్వరరావు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, లక్ష్మీకిరణ్ దంపతులు హాజరౌతారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధికమిటీ సభ్యులు బుద్ధ న లక్ష్మీప్రభాకర జ్యోతి, అనంతపల్లి రాజరాజేశ్వరి, దుడే సీతారత్నం, కొనగళ్ల రాధ పాల్గొన్నారు.

### బాల్య వివాహాలు నేరం

**తణుకు టౌన్:** బాల్య వివాహాలు నేరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం అరుణ కుమారి చెప్పారు. బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తణుకు బాలికోన్నత పాఠశాలలో బాలికలకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలకు వివాహం చేయడం ద్వారా కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. బాలికలకు పౌష్టికాహారం, బాలికల రక్షణకు సంబంధించిన వివిధ అంశాలపై మాట్లాడారు. దిశ చట్టం, చైల్డ్ హెల్ప్‌లైన్, సేవలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

### ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

**సాక్షి, భీమవరం:** పట్టణంలో ఓ వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు టుటౌన్ ఎస్సై పి.అప్పారావు చెప్పారు. టుటౌన్ ప్రాంతంలోని ఏఎస్ఆర్ నగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న కె.రాజన్‌రాజు (78) అవివాహితుడు. కొంతకాలంగా తీవ్రమైన మానసిక ఒత్తిడితో ఇబ్బంది పడుతూ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం తన ప్లాట్‌లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూనపరాజు వెంకట్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

# రీ సర్వేతో భూ సమస్యలకు స్వస్తి

**ఉండి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష కార్యక్రమం ద్వారా ప్రస్తుతమే కాకుండా భవిష్యత్‌లో కూడా భూ సంబంధ సమస్యలు ఉండవని చెరుకువాడ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు అన్నారు. బుధవారం ఉండి మండలం చెరుకువాడలో డ్రోన్ సహాయంతో రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఓ మంచి కార్యక్రమానికి పూనుకుందన్నారు. రీసర్వే ద్వారా ప్రభుత్వ భూములు,ప్రైవేటు భూముల వివరాలు స్పష్టంగా తెలుస్తాయన్నారు.దీనివల్ల మరో వందేళ్లయినా ఎలాంటి సమస్యలు రావని అన్నారు. స్థానిక రెవెన్యూ అధికారి చిన్నారావుకు రైతులు తమ పట్టాదార్ పాస్‌పుస్తకం,ఆధార్,బ్యాంక్‌బుక్ తదితర వివరాలు అందజేస్తే జరగాల్సిన పనులు సవివరంగా జరుగుతాయన్నారు. రీ సర్వే ద్వారా సరిహద్దులు కూడా కచ్చితంగా తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్రపాటి అనిత, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి బందెల ప్రమీల, కార్యదర్శి కె.గోపాలకృష్ణ, ఆర్ఐ వి.ఆంజనేయులు, వీఆర్‌ఓ చిన్నారావు, బొడ్డు నాగన్న, బందెల జార్జ్ పాల్గొన్నారు.



చెరుకువాడలో రీసర్వే నిర్వహణలో పాల్గొన్న అధికారులు

**ఆకివీడులో..**

**ఆకివీడు:** మండలంలోని పెదకాపవరం, చినకాపవరం,గుమ్ములూరు, కోళ్లపర్రు, సిద్ధాపురం గ్రామాల్లో భూముల రీ సర్వే చేయిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతులు, భూమి యజమానులు భూమి హక్కుకు సంబంధించిన హక్కు పత్రాల్ని సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారికి అందజేయాలని సూచించారు. దస్తావేజులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఎకౌంట్, పాసుపోర్టు సైజు 2 ఫోటోలు, ఫోన్ నెంబర్ అందజేసి, తగిన ఆధారాలను తెలియజేయాలని సూచించారు. రీ సర్వేకు ప్రజలు, రైతులు, భూమి యజమానులు సహకరించాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

# 17 నుంచి వీరంపాలెంలో శివరాత్రి ఉత్సవాలు



వీరంపాలెం శైవక్షేత్రం

**తాడేపల్లిగూడెం రూరల్:** తాడేపల్లిగూడెం మండలంలో రెండో దక్షిణ కాశీగా విరాజిల్లుతోన్న వీరంపాలెం శైవక్షేత్రంలో ఈ నెల 17 నుంచ 19 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు బాలాత్రిపుర సుందరీ పీఠం వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి తెలిపారు. 17న ఉదయం చక్కా వెంకట రామరమణమూర్తి దంపతుల కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 11.30 గంటలక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం మేధాసరస్వతి అమ్మవారికి లక్ష పుష్పార్చన, రాత్రికి భూప్రస్తార శ్రీచక్రార్చన, 18న మహాశివరాత్రి సందర్భంగా స్ఫటిక లింగానికి మానస సరోవర జలాలతో అభిషేకం, రాత్రికి శివపార్వతుల దివ్య కల్యాణం, 19న లక్ష బిల్వార్చన, సాయంత్రం శాంతి కల్యాణం నిర్వహించనున్నట్టు వివరించారు. భక్తులంతా పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి తరలించాలని వెంకటరమణ శాస్త్రి విజ్ఞప్తి చేశారు.

# అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభం



వేల్పూరులో పనులను ప్రారంభిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు వెంకట ప్రసాద్

**తణుకు టౌన్:** జగనన్న లే అవుట్లకు వెళ్లే రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ అన్నారు. బుధవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు నందిరాజు పుంతలోని జగనన్న కాలనీకి వెళ్లే అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులు కేటాయించిన స్థలాల్లో ప్రభుత్వ సాయంతో త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**శ్మశాన వాటిక పరిశీలన**

వేల్పూరు గ్రామంలోని ఎస్సీల శ్మశాన వాటికకు అవసరమైన స్థలాలను తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలోని మూడు చోట్ల ఉన్న స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ భవాని, వీఆర్‌ఓ నూతంగి నర్సయ్య, సర్వేయరు రుద్రా, తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్‌లో శశి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శశి కళాశాల కాంపస్ ఇన్‌చార్జి, ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపక సిబ్బంది

**తణుకు టౌన్:** మంగళవారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో తణుకు శశి జూనియర్ కళాశాల అత్యధిక పర్సంటైల్స్ సాధించినట్టు శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ తెలిపారు. కర్రి దానేశ్వర్ రెడ్డి 99.34 పర్సంటైల్, మానేపల్లి జీవన్ 98.21, పొట్లూరి పావని 98.09, వల్లూరి లలిత 96.89, ఆరవల్లి యోగిత 96.89, యల్లపు పూర్ణసాయి కార్తీక్ 96.69, చావలి సాయి శివ శరణ్ 95.59, పోలిశెట్టి దత్త ప్రియ 95.49 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. తమ విద్యార్థులు 90 పర్సంటైల్ పైగా 24 మంది సాధించారని చెప్పారు. విద్యార్థులను శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ, కాంపస్ ఇన్‌చార్జి ఎస్.రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్.రాఘవేంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ వి.సత్యనారాయణరెడ్డి, తదితరులు అభినందించారు.

# పైబోయిన కుటుంబానికి పరామర్శ



అత్తిలిలో పైబోయిన విజేయులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**అత్తిలి:** పితృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు, సొసైటీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ కుటుంబ సభ్యులను పలువురు ప్రజా ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు బుధవారం పరామర్శించారు. పైబోయిన విజేయుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ తణుకు మండల అధ్యక్షుడు పోలేపల్లి వెంకటప్రసాద్, తణుకు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు జంగం ఆనందకుమార్, రేలంగి సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, వేల్పూరు ఎంపీటీసీ సభ్యురాలు సుంద్రు శ్యామల, చేబ్రోలు పెద్దిరాజు, నియోజకవర్గంలోగల వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ, సీపీఎం నాయకులు, సొసైటీల అధ్యక్షులు తదితరులు పైబోయిన కుటుంబాన్ని పరామర్శించారు.

### మంచినీటి చెరువుల సంరక్షణ

**పాలకోడేరు:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ అమృత్ సరోవర్ పథకంలో భాగంగా మంచి నీటి చెరువులను సంరక్షించే కార్యక్రమం ప్రారంభించామని ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ పిల్లి చిట్టి జయబాబు అన్నారు. బుధవారం శృంగవృక్షం గ్రామ పరిధిలో బంటుమిల్లి లోని చెరువు వద్ద అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మిషన్ అమృత్ సరోవర్ పథకంలో చెరువులను అభివృద్ధి చేసి, సంరక్షిస్తామన్నారు. అనంతరం చెరువు గట్ల వెంబడి మొక్కలు పాతి, వాకింగ్ ట్రాక్‌గా స్థానిక పంచాయతీ తీర్చి దిద్దుకోవచ్చన్నారు. పాలకోడేరు మండలంలో గొల్లలకోడేరు, విస్సాకోడేరు గ్రామాల్లో ఒక్కొక్క చెరువు చొప్పున, శృంగవృక్షం గ్రామంలో రెండు చెరువులు ఈ పథకంలో మంజూరయ్యాయని, ఒక్కో చెరువు అభివృద్ధికి 5 లక్షల చొప్పున నిధులు మంజూరవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగం సూరిబాబు పాల్గొన్నారు.

### కాళ్లలో ఆధార్ ప్రత్యేక క్యాంపు

**కాళ్ల:** మండలంలో ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ ఏఓ ఎంఎస్ ప్రభాకరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ క్యాంపులో సచివాలయం ద్వారా ఆధార్ సేవలు, ఆధార్ మొబైల్ నెంబర్ లింకు, ఈ-మెయిల్ లింకు, బయోమెట్రిక్, పుట్టినరోజు, పేరు మార్పు, ఆధార్ అప్డేట్, చిరునామా మార్పులు చేస్తారన్నారు. అదేవిధంగా కొత్త ఆధార్ కార్డు కూడా నమోదు నమోదు చేసుకునేందుకు వీలుంటుందని స్పష్టం చేశారు. 8న కాళ్ల 2, 9న ఏలూరుపాడు 1, 10న ఏలూరుపాడు 2లో మూడు రోజులపాటు క్యాంపు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# గృహసారథులే విజయ సారథులు



పెనుగొండలో గృహసారథుల శిక్షణలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



సిద్ధాంతంలో గృహ సారథుల శిక్షణలో మాట్లాడుతున్న షర్మిలారెడ్డి

**పెనుగొండ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో సంక్షేమపథకాల అమలుకు గృహసారథులను నియమించారని, వారే రాబోయే ఎన్నికల్లో విజయసారథులుగా సారథ్యం వహించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం పెనుగొండలో పెనుగొండ, వడలి, వెంకట్రామపురం, దేవ, తామరాడ, కొఠాలపర్రు, మునమర్రు, సోమరాజు చెరువులకు చెందిన వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లుకు శిక్షణా సమావేశం నిర్వహించారు. నాడు జన్మభూమి కమిటీల పేరుతో చంద్రబాబు, ఆయన అనుచరులు దోచుకుతింటే, నేడు సీఎం జగన్ ఆత్మ బంధువులు వలంటీర్లతో పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. మరింత మందికి సంక్షేమం అందించడానికి ప్రతీ 25 ఇళ్లకు గృహసారథిని నియమించారన్నారు. వీరు నిత్యం వారితో సాన్నిహిత్యంగా ఉంటూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు.ప్రజల న మ్మకమే సీఎం జగన్ అని, మరింత అండగా నిలిచి సీఎం జగన్ లక్ష్యమైన 175 నియోజకవర్గాల్లో విజయాన్ని అందించాలని కోరారు. ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు, రుడా చైర్మన్ మేడపాటి షర్మిళారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ అధికారం చేపట్టని తరువాత మహిళలకు అత్యంత ప్రాముఖ్యత నిచ్చారన్నారు. వలంటీర్లు దగ్గర నుంచి స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లోనూ సగానికి పైగా అవకాశం కల్పించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. వలంటీర్లు, గృహసారథులే సీఎం జగన్ కుటుంబ సభ్యులన్నారు. సమావేశంలో పెనుగొండ ఏఎంసీ చైర్మన్ వెలగల వెంకట రమణ, ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, పెనుగొండ ఉప సర్పంచ్ ఆకిశెట్టి వరలక్ష్మీ, సర్పంచ్‌లో నల్లూరి సత్యనారాయణ, మాకినీడి సత్యనారాయణ, దంపనబోయిన రూప,మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, సాక సుబ్రహ్మణ్యం, బాలం సత్తిరాజు, బళ్ల బద్రీ, రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం , తోలేటి శ్రీను, ఎంపీటీసీ తాడి సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**చంద్రబాబుది ప్రచారార్భాటం**

**పెనుగొండ:** ప్రచారార్భాటంతో చంద్రబాబు ప్రజలను చంపేశారని, అయినా నేటికి ప్రచారార్భాటం మానడం లేదని ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు, రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం సిద్ధాంతంలో దొంగరావిపాలెం, సిద్ధాంతం, నడిపూడి, ఇలపర్రు, ములపర్రు, రామన్నపాలెంకు చెందిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు శిక్షణా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతీ హామీని నిలబెట్టుకుంటూ సంక్షేమాన్ని అందిస్తున్నారన్నారు. ఆచంట నియోజకవర్గంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సొంత ఖర్చులతో సేవలందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, పెనుగొండ మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీను, ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనరు సాక సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు చిన్నం ఏడుకొండలు, సర్పంచ్‌లు యర్రంశెట్టి బుజ్జి, కడలి బేబీ అన్నపూర్ణ, పార్టీ నాయకులు సరేళ్ల లాజరస్, దంపనబోయిన బాబూరావు, జుత్తిగ బాలయ్య, కేశవరపు గణపతి, పెచ్చెట్టి జేమ్స్, గుత్తుల రాముడు, బలువు కృష్ణమూర్తి, పురిళ్ల శ్రీను, దామోదర్, డీఆర్‌సీ రాజు, వేండ్ర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.